

టెన్నిస్ వరల్డ్ డెఫ్ చాంపియన్‌షిప్‌లో శివాజీ ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గ్రీస్‌లో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడా పోటీల్లో రాజమండ్రి కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా బాల కుమారుడు శివాజీ రెండు పతకాలు సాధించాడు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బాల ఈ వివరాలు వెల్లడించారు. తన కుమారుడు శివాజీ విటి కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతున్నాడన్నారు. వరల్డ్ డెఫ్ ఛాంపియన్ షిప్‌లో సీనియర్స్ విభాగంలో సింగిల్స్‌లో బ్రాంజ్ మెడల్, డబుల్స్ లో రజత (సిల్వర్)పతకం సాధించాడని తెలిపారు. 42 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సింగిల్ విభాగంలో మూడవ స్థానం సాధించాడన్నారు. రాజస్థాన్ క్రీడాకారునితో కలిసి ఆడిన డబుల్స్‌లో రెండవ స్థానం లభించిందన్నారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పెండెం రామాజీ, మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈనెల 9న నగరానికి వస్తున్న శివాజీని ఊరేగింపుగా తీసుకొస్తామన్నారు.

రాబోయే రోజుల్లో అంతరిక్ష పర్యాటకం

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రారంభ సభలో శ్రీహరికోట ఎస్‌డిఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ రఘురామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న రోజుల్లో ప్రజలకు అంతరిక్ష పర్యాటకం అందుబాటులోకి రాబోతోందని, అందుకు అనుగుణంగా ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు సాగిస్తోందని శ్రీహరికోట ఎస్‌డిఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ టిఎస్.రఘురామ్ తెలిపారు. అంతరిక్షానికి అవధి లేదని, ఈ విశ్వం అనంతమని, అపారమని, ఎవరికీ చెందిన సంపద ఉండదన్నారు. ఈనెల 8 వరకు నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇస్రో ఆధ్వర్యాన శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఆత్మ నిర్భర్ భారత్, స్వాతంత్ర్య అమృతోత్సవం నేపథ్యంలో అంతరిక్ష విజ్ఞానాన్ని ఇంటింటికీ తీసుకెళ్లే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 2016 నుంచి అంతరిక్ష వారోత్సవాలను వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 'స్పేస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్' పేరుతో అంతరిక్ష వారోత్సవాలు నిర్వమిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో 9బిలియన్ డాలర్ల వ్యాపారం సాగుతుండగా 2047 నాటికి ఇది 70 రెట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. శ్రీహరికోట షార్ ఎల్‌ఎస్‌ఎస్‌ఎఫ్ జనరల్ మేనేజర్ ఎన్. విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజమహేంద్రవరంతో పాటూ విశాఖ, కర్నూలు, శ్రీహరికోటల్లో వారోత్సవాలు చేస్తున్నామన్నారు.

ఇస్రో రాకెట్స్ నమూనాల ప్రదర్శన

ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఇస్రో ఆధ్వర్యాన శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజెస్ అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ఆనం కళాకేంద్రం ఆవరణలో ఇస్రో కార్యకలాపాల వివరాలు, రాకెట్స్ నమూనాల ప్రదర్శనను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి కె.పద్మరాజు ప్రారంభించారు. శ్రీహరికోట ఎస్‌డిఎస్‌సిడిప్యూటీ డైరెకర్ టిఎస్.రఘురామ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె దినేష్ కుమార్, శ్రీహరికోట షార్ ఎల్‌ఎస్‌ఎస్‌ఎఫ్ జనరల్ మేనేజర్ ఎన్.విజయకుమార్, ఎస్‌డిఎస్‌సి హెడ్ లీలా నాగ శ్రీనివాస్, రాజమహేంద్రి మహిళా కళాశాల చైర్మన్ టి. కె. విశ్వేశ్వర రెడ్డి, పలువురు ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఉప విద్యాశాఖాధికారి నారాయణ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వల చేస్తున్న షాంరెస్‌డిఎస్‌సి డిప్యూటీ డైరెక్టర్ రఘురామ్, విసి పద్మరాజు తదితరులు

విద్యార్థులు అసలైన లీడర్లుగా ఎదగాలి

విద్యార్థులు అసలైన లీడర్లుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి కె.పద్మరాజు సూచించారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. ఇస్రో ప్రయోగాలతో భారత కీర్తి పతాక రెపరెపలాడుతోందన్నారు. తాజాగా చంద్రయాన్ విజయవంతంతో ప్రపంచం అంతా భారత్‌వైపు చూస్తోందన్నారు. ఇస్రో రూపొందించిన బ్రోచర్ ని విసి పద్మరాజు ఆవిష్కరించారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి : కమిషనర్

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ సూచించారు. ఇప్పుడున్న సౌకర్యాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చంద్రయాన్ విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఇస్రో రూపొందించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం అతిథులను సత్కరించారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న విసి



నమూనా రాకెట్లనుపరిశీలిస్తూ...

జెకెసితో సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

ప్రజాశక్తి -దేవరపల్లి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం జెకెసిని నిర్వహిస్తుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. దేవరపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం" మండల స్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి ఎన్.తేజ్‌భరత్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డిఆర్‌ఒ జి.నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి 96 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కొక్క రోజు ఒక్కో మండలంలో 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలోనే సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు, ఇంటి పట్టా సమస్యలు, కరెంటు మీటర్ల సమస్యలు, శానిటేషన్‌పై ఎక్కువగా అర్జీలు ఉన్నాయన్నారు. ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధి తో పనిచేయాలనే లక్ష్యం దిశగా 'జగనన్నకు చెబుదాం 1902' కార్యక్రమాన్ని సిఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. అలాగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. జెసి తేజ్‌భరత్ మాట్లాడుతూ జెకెసిలో వచ్చిన అర్జీలకు వారంలోగా పరిష్కారం చూపాలన్నారు. ఆర్థిక పరమైన అంశాలతో కూడిన అర్జీలను జిల్లా, డివిజన్ స్థాయిలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సిపిఒ ఎ.ముఖలింగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డిటిఒ ఎన్.సత్యనారాయణ, డిఇఒ ఎస్.అబ్రహాం, ఆర్‌టిఒ కెవి.కష్ణారావు, ఎల్‌డిఎం డిబి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత జెసి తదితరులు

రీసర్వే తర్వాత భూముల వివరాలు మాయం

మంత్రి వద్ద పలువురు రైతుల ఆవేదన

ప్రజాశక్తి - తాళ్లపూడి

రీ సర్వే తర్వాత తమ భూములకు సంబంధించిన వివరాలు ప్రభుత్వ లెక్కల్లో కనిపించట్లేదని, దీనిపై తమకు న్యాయంచేయాలని పోచవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు హోం మంత్రి తానేటి వనిత వద్ద వాపోయారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిమిత్తం పోచవరం వచ్చిన మంత్రి వనితను రైతులు కలిసి వారి ఇబ్బంలను తెలిపారు. మంత్రి స్పందించి వెంటనే అధికారులను పిలిచి ఆరా తీశారు. ఈ భూములు చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా స్వాధీనం చేసుకున్నామని, దీనికి సంబంధించిన పూర్తి సమాచారం జెసి వద్ద ఉంటుందని అధికారులు తెలిపారు. దీనిపై రైతులు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ సమయంలో తమ పొలాలు తీసుకుంటామని అధికారులు చెప్పారని, తరువాత మళ్లీ మార్పు చేశారన్నారు. దీనిపై 2015లో కోర్టును ఆశ్రయించగా తీర్పు కూడా తమకు అనుకూలంగానే వచ్చిందన్నారు. తమ భూముల్లో తామే వ్యవసాయం చేసుకుంటున్నామని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 22 మందికి రైతులకు సంబంధించిన పది ఎకరాల భూమి రీ సర్వే అనంతరం రికార్డుల్లో లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో రామారావు కాకర్ల విష్ణుమూర్తి, చెరుకూరి సత్యనారాయణ తదితర రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

10 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో ఈ నెల 10 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, మండల ప్రత్యేక అధికారి సత్యగోవింద్ తెలిపారు. విధివిధానాలపై శుక్రవారం మైత్రి కమిటీ సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఏఏ శాఖలు ఏ విదులు నిర్వహించాలి వంటివాటిపై సమీక్షించారు. సమస్యలు ఉత్పన్నమైతే తీసుకోవాల్సిన చర్యలపై 15 రోజులకు ఒకసారి సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మండలంలో ఈ-పంట నమోదు 100శాతం పూర్తయిందని, గ్రామసభల నిర్వహణ మాత్రమే ఉందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. గోనె సంచులు, రవాణా, మిల్లర్ల నుంచి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహాశీల్దార్ రవీంద్రనాథ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి. రాజారావు సివిల్ సప్లైస్ డిటి మండలంలోని వ్యవసాయ సలహా మండలి సభ్యులు గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకులు సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చాగల్లు : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం సేకరణపై అధికారులతో తహాశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ బి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. గోనెసంచుల కొరత, ధాన్యం సేకరణ, చెల్లింపులపై సమీక్షించారు. రైతులు నుంచి ధాన్యం సైకరణకు అవసరమైన చర్యలను వివరించారు. మైత్రి కమిటీని ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.వేణుగోపాల్, వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రైసు మిల్లర్లు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధితో మెరుగైన బోధన

ప్రజాశక్తి - గోపాలపురం

మునుపెన్నడూ లేనివిధంగా నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి చేయడంతో పాటు ఆంగ్ల మాధ్యమం ప్రవేశంతో మెరుగైన బోధనను అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత, ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం డా బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ శాసన సభ్యులు తలారి వెంకట్రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రభుత్వ పాఠశాలలో బోధన జరుగుతుందన్నారు. నాడు-నేడుతో పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. మీలో ఎంతమంది ఇంజినీర్లు అవుతారని' కలెక్టర్ మాధవీలత ప్రశ్నించారు. విద్యార్థినులు ఉత్సాహంగా చేతులు ఎత్తి తమ అభీష్టాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెస్సికా అనే బాలిక తన అభిప్రాయాన్ని ఆంగ్లంలో వ్యక్తం చేసింది. విద్యార్థులందరూ జెసికాని రోల్ మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.



అంతరిక్ష వారోత్సవాల్లో కుసుమకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అంతరిక్ష వారోత్సావాల్లో వేలివెన్ను ఉపాధ్యాయురాలు పులి కుసుమ ప్రథమ బహుమతి సాధించారు. మండలంలోని వేలివెన్ను పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఆమె శుక్రవారం ఇస్రో ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఆమె తయారు చేసిన చంద్రయాన్-3 బోధనోపకరణానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఈ మేరకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ఆమె అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలివెన్ను ఉపాధ్యాయులు ఎస్.శాంతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



నర్సరీలో తమిళనాడు అధికారుల బృందం

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళపూడి

గోపాలపురం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతూ అనారోగ్యానికి గురైన అన్నదేవర పేటకు చెందిన కౌలూరి సుజితకు వైద్య ఖర్చుల నిమిత్తం మండల మానవతా శాఖ రూ.5వేలు, మానవతా సభ్యులు వెలుగుబంటి శ్రీనివాస్ మరో రూ.వేయి ఆర్థిక సాయం అందించారని మానవతా శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దోశయ్య, అప్పన హనుమంతరావు, బి.శంకర్, సనపల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎకు ఆటో యూనియన్ కతజ్ఞతలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వాహన మిత్ర ద్వారా ఆర్థిక సాయం అందించినందుకు ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్‌నాయుడుకు చివటంలో శ్రీ అమ్మ ఆటో యూనిన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం ఆటో నడుపుకుంటున్న ఆటో డ్రైవర్లకూ వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సాయం అందించిన ఘనత సిఎం జగన్‌కే సాధ్యమన్నారు. ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు పైబోయిన ఏసుబాబు ఎంఎల్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. అనంతరం అనంతరం కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-నల్లజర్ల

విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి వచ్చిన లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. వీరవల్లి టోల్ ప్లాజా వద్ద టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. వారికి అభివాదం చేస్తూ 'రాజుగారు వెళ్ళొస్తా' అని మద్దిపాటికి చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటముక్కల వేణు, రావూరి రమణ, విడియాల శ్రీను, చింతా చైతన్య, కోరా కన్నయ్య, పుసులూరు శ్రీను, సవలం రామకష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు బాలికలు

చాగల్లు : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం పి.వీర్రాజు తెలిపారు. ఈనెల 5న ఏలూరు సిఆర్ రెడ్డి కాంప్లెక్స్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ క్రికెట్ పోటీల్లో ఎం.తేజ, ఎస్.గీత, పి.సాయితేజ ప్రతిభ చూపారు. దీంతో వారు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పిఇటి మున్నీ, పీడీ విజయలక్ష్మిలను ఉపాధ్యాయులు, పిఎంసి సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

తమిళనాడు అధికారులు నర్సరీల సందర్శన

ప్రజాశక్తి- కడియం

తమిళనాడుకు హార్టికల్చర్ శాఖకు చెందిన 50 మంది సభ్యుల బృందం శుక్రవారం కడియంలో శ్రీసత్య దేవా నర్సరీ(పుల్లా ఆంజనే యులు అండ్ సన్స్)ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పుల్లా రాజశేఖర్ నర్సరీ మొక్కలకు సంబంధించిన విగ్రాఫ్టింగ్, లెరింగ్ మరియు ఇంపోర్ట్ అండ్ ఎక్సపోర్ట్ వంటి అంశాలను వివరించారు.

పేరయ్యకు గురుబ్రహ్మ అవార్డు

ప్రజాశక్తి - దేవరపల్లి

ఉపాధ్యాయ వృత్తిలో చేసిన కృషికి భాష్యం స్కూల్ ప్రిన్సిపల్, గణిత ఉపాధ్యాయుడు పి.పేరయ్యనాయుడుకు గురుబ్రహ్మ అవార్డు దక్కింది. ఈ నెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఆనంద రీజెన్సీలో జరిగిన కార్యక్రమంలో నన్నయ యూనివర్శిటీ విసి కె.పద్మరాజు, షార్, ఇస్రో గ్రూప్ డైరెక్టర్ పి.గోపికష్ణ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల యాజమాన్యం, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్యశిబిరం నుంచి వచ్చి కుప్పకూలి...


ప్రజాశక్తి - గోపాలపురం

జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన వ్యక్తి కుప్పకూలి చనిపోయిన ఘటన శుక్రవారం గోపాలపురంలో చోటుచేసుకుంది. గోపాలపురం గ్రామానికి చెందిన బాసిన వెంకటేశ్వరరావు, వద్ధురాలు అయిన తల్లితో కలిసి పంచాయతీ వెనుక వీధిలో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా వెంకటేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. శుక్రవారం గోపాలపురంలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నాడు. బిపి ఎక్కువగా ఉండటంతో వైద్యులు పలురకాల మందులను అందించారు. నాలుగు గంటల ప్రాంతానికి ఇంటికి వచ్చాడు. తల్లికి టీ పెట్టి ఇచ్చాడు. ఇద్దరూ కలిసి టీ తాగిన అనంతరం ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే తల్లి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి సపర్యలు చేశారు. 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే వెంకటేశ్వరరావు(68) మృతి చెందాడు. కుమారుని మృతితో తల్లి కన్నీరుమున్నీరైంది. కుమారునిపై పడి ఏడస్తున్న తీరు కంట తడిపెట్టించింది.



కుమారుని మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి

కార్టూ'నిజం'



కొనసాగుతున్న సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జిల్లాలో పలుచోట్ల వైద్య శిబిరాలు కొనసాగతున్నాయి. **తాళ్లపూడి** మండలం పోచవరంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి తానేటి వనిత హాజరై మాట్లాడారు. ఇంటి ముంగిటకే ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంతో ప్రజలందరికీ ఆరోగ్య సేవలతో పాటూ ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. వైద్య పరీక్షల కోసం ఏర్పాటు చేసిన విభాగాలను ఆమె పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలను గురించి ఆరా తీశారు. ఈ శిబిరంలో 480 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రామలక్ష్మి పూలబొకేతో తొలుత మంత్రికి స్వాగతం పలకారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ఎంపిడిఒ రమణ, తహాశీల్దార్ రాధిక, ఎఎంసి చైర్మన్ వల్లభశెట్టి శ్రీను సొసైటీ అధ్యక్షులు దొరబాబు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గోకవరం మండలం కామరాజుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొని మాట్లాడారు.పేదలకు ఆరోగ్య రక్షణ అందించడం కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత ఆయన వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 550 మందికి వైద్యసేవలు అందిందాచరు.. అనంతరం నూతనంగా నిర్మించిన ఆర్‌బికెను ప్రారంబించారు. సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, వైసిపి నాయకులు సింబోతుల శ్రీనివాస్, దాసరి రమేష్, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, మడికి మైనర్ బాబు, గోకాడ చిట్టిబాబు పాల్గొన్నారు. **చాగల్లు** మండలం నందింగంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను స్టాల్ ను పరిశీలించారు, అలాగే స్టాలలోని వైద్యులతో, సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికి విచ్చేసిన రోగులను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుదవ రాంబాబు, ఉన్నగట్ల సర్పంచ్ మట్ట వెంకట్రావు, ఎస్.ముప్పవరం సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మి, వైసిపి నాయకులు చెల్లింకల దుర్గా మల్లేశ్వరం, వైద్యులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలం చివటంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు. ఈ శిబిరంలో450 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఎంఎల్‌హెచ్‌పి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, చివటం పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, శరత్, అధికారులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం మండలం చివటంలో రోగులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నాయుడు

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కోరుకొండ మండలం కనుపూరులో వద్దురాలి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. కనుపూరుకు చెందిన తల్లోజు పార్వతి ఈ నెల 3వ తేదీన ఇంటిలో హత్యకు గురయ్యింది. ఈ కేసులో ఆమె కోడలు, మనవరాలిని పోలీసులు నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. తల్లోజు పార్వతికి తొమ్మిది మంది సంతానం. వీరిలో నాలుగో కొడుకు తల్లోజు వీరబాబు ఇంటిలో పార్వతి ఉంటోంది. వీరబాబు భార్య శ్రీలక్ష్మి కోసం తరచూ పురుషులు వస్తున్నారని, శ్రీలక్ష్మి కూతురైన బాలికకు ఎవరితోనో ప్రేమ వ్యవహారం ఉందని పార్వతి శ్రీలక్ష్మిని నిలదీసింది. దీంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కోడలు, మనవరాలు పథకం ప్రకారం పార్వతి ఇంటిలో పడుకున్నాక ఇనుప రాడ్డుతో ఆమె తలపై కొట్టి హత్య చేశారు. మర్నాడు ఉదయం ఏమీ తెలియనట్టు ఎవరో కొట్టేసి చంపేశారని అందరికీ చెప్పారు. దీనిపై పార్వతి కుమారుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. పరారీల్లో ఉన్న తల్లీ కూతుళ్లను శుక్రవారం అరెస్టు చేశారు.

హత్య కేసులో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

ఉండూరు గ్రామానికి చెందిన కొత్తెం సుబ్రహ్మణ్యం హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నిందిడుతు చిట్టిమూరి సత్తిబాబును పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సుబ్రహ్మణ్యం ఈ నెల 2న ధర్మతేజా లే అవుట్ సమీపంలో గాయాలతో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండగా గుర్తించారు. అతడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో సుబ్రహ్మణ్యం, సత్తిబాబు మధ్య తలెత్తిన వివాదం కారణంగా సత్తిబాబు సుబ్రహ్మణ్యంపై దాడి చేసి హత్య చేసినట్టు తేలింది. సత్తిబాబును శుక్రవారం కాకినాడ స్పెషల్ మొబైల్ జెఎఫ్‌సిఎం కోర్టుకు అప్పగించారు. అతడికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

కాట్రావులపల్లిలో గ్రూపుల ఘర్షణ

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

మండలంలోని కాట్రవులపల్లిలో రెండు గ్రూపుల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. కాట్రావులపల్లిలో రెండు రోజుల క్రితం పుట్టిన రోజు వేడుకల్లో రెండు సామాజిక వర్గాల వారు ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారని డిఎస్‌పి లతాకుమారి తెలిపారు. దీంతో రేగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి తమ సిబ్బందితో చేరుకుని పరిస్థితిని అదుపు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. శుక్రవారం రాత్రి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మామిడాడ గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మామిడాడకు చెందిన కనిపి రాజేష్, సంధ్యా రాణి(26)కి 2016లో వివాహం అయ్యింది. ఈ నేపథ్యంలో సంధ్యారాణిని కట్నం కోసం వేధించినట్టు పోలీసుల తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైె సంధ్యారాణి ఉరేసుకోగా భర్త రాజేష్ ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధృవీకరించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామంలో నలుగురు వ్యక్తులు కోడిపందేలు ఆడుతున్నారని సమాచారంతో శుక్రవారం కొత్తపల్లి ఎస్క్మి స్వామి నాయుడు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద రెండు కత్తులు, రూ.800 నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

కొబ్బరికాయలు దొంగిలించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక రైతు పొలంలో ఉన్న కొబ్బరికాయలను పట్టుకు పోవడానికి ప్రయత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం వారి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వసంతవాడ గ్రామానికి చెందిన మారిశెట్టి వెంకటేశ్వర్లు పొలంలో ఉన్న కొబ్బరికాయలను ఆత్రేయపురం గ్రామానికి చెందిన రుద్రరాజు శివ సూర్యనారాయణ రాజు శుక్రవారం పొలంలోనికి వచ్చి సుమారు 500 కొబ్బరికాయలు మూటలు కట్టుకుని వెళ్లిపోవుతున్నాడు. ఈ సమయంలో వెంకటేశ్వర్లు. పట్టుకొనేందుకు ప్రయత్నించగా పారిపోవడం తో. స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-పెరవలి

మండలం ఖండవల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో ఉన్న 21 నెంబర్ అంగన్‌వాడీ సెంటర్ ను శుక్రవారం ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎంపిడిఒ డి.దామోదర్రావు సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందుతుందా లేదా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట సీనియర్ అసిస్టెంట్ అరిగెల వేణుగోపాలరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


పాబోలు గున్నయ్య(ఫైల్)

మండలం లోని దమ్మెన్నుకు చెందిన శతాధిక వృద్ధుడు పాబోలు గున్నయ్య(102) శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని భార్య ఐదేళ్ల క్రితం మరణించింది. సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ గున్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. సానుభూతిని వ్యక్తం చేశారు.

లింగ నిర్ధారణ నిషేధం అమలుకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం



కాకినాడలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సత్యనారాయణ

లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయాల్లో వైద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కాకినాడలో ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చట్టం అమలు తీరుతో పాటు స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించిన వివరాలపై సమావేశంలో చర్చించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పిసి, పిఎన్‌డిటి) చట్టం పటిష్ట అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నెలలకు ఒకసారి మొదటి శుక్రవారం మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం సక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఒ సత్యనారాయణ వెల్లడించారు. కాకినాడ డివిజన్‌లో గుర్తింపు పొందిన మొత్తం 104 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని ఇందులో 10 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నాయన్నారు. ఆల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాకినాడ డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లలో రెండు నెలల్లో 37 డెకాయ్ ఆపరేషన్ల, 133 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. కొత్తగా నాలుగు స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు నిమిత్తం జిల్లా కమిటీకి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ సమావేశంలో డిఐఒ డాక్టర్ కె.రత్నకుమార్, జిజిహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ జి.హరిత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, ఎస్.గోవిందరావు, గైనికాలజిస్టు డాక్టర పి.సుజాత, ఎన్‌జిఒ ప్రతినిధులు కె.సింహాద్రి పాల్గొన్నారు. పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డి జె.సీతారామారావు మాట్లాడారు. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను తరచుగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎడిఎం హెచ్ఒ డాక్టర్ సరిత, డాక్టర్ సుదీప్తి, డాక్టర్ ఎం.చంద్ర, న్యాయవాది కెవి.చలం తదితరులు పాల్గొన్నారు.

'కోట'లో ట్రాఫిక్ నిబంధనలు పట్టవా

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్


నిబంధనలకు విరుద్ధంగా వస్తున్న ఆటో

సామర్లకోట పట్టణం నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమత మవుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు మూడు చెరువుల నీరు తాగుతుండగా వాహనదారులు మాత్రం వారికి సహకరించకుండా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. దానితో పట్టణంలో ట్రాఫిక్ సమస్య వీడని చిక్కుముడిగా కొనసాగుతోంది. కాకినాడ వైపు రాకపోకలు సాగించే వాహనాలు గాంధిబొమ్మ సెంటర్ మీదుగా రైలు గేటులో నుంచి రాకపోకలు సాగిస్తున్నందున రైలుగేటులో మాటిమాటికీ వాహనాల రద్దీ ఏర్పడి గేటు పడక సిగ్నల్ కు ఇబ్బంది ఏర్పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో సుమారు సంవత్సర కాలంగా రైలుగేటు రోడ్డులో కేవలం ద్విచక్ర వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతినిస్తూ గాందేబొమ్మ వద్ద, కెనాల్ రోడ్డు రైలుగేటు వద్ద రోడ్డుకు అడ్డుగా ట్రాఫిక్ బోర్డులను ఏర్పాటు చేసినా ఆటోలు, కార్లు వంటి వాహనాల రాకపోకలు ఆగడం లేదు. దానితో సమస్య యధాతథంగా మారుతోంది. ఆ వాహనాలు రాకకు మార్గం లేకపోయినా అడ్డుగా ఏర్పాటు చేసిన బోర్డులను ప్రక్కకు నెట్టివేసి రాకపోకలు జరుపుతున్న దశ్యాలు కనిపిస్తున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది వాహనదారులను ఎంతగా హెచ్చరిస్తున్నా ఆ హెచ్చరికలను వాహనదారులు ఖాతరు చేయడం లేదు. రైలుగేటు తెరవగానే ఒక్కసారిగా ద్విచక్ర వాహనాల మధ్యలో పెద్ద వాహనాలు ఇరుక్కు పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహన దారుల్లో ట్రాఫిక్ పై అవగాహన లేకపోవడంతో పాటు వారి నిర్లక్ష్యం, దగ్గరి దారిలో త్వరగా వెళ్లడంతో పాటు ఆయిల్ ఆధా చేసుకోవాలని వాహనదారులు ఆలోచించి నిబంధనలు మీరుతుండటంతో ఈ సమస్య ఎదురవుతోంది. అలాగే ట్రాఫిక్ సిబ్బంది కొరత కారణంగా రైలు గేటు రోడ్డుకు ఇరువైపులా విధులు అన్ని సమయాల్లో నిర్వర్తించలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో పోలీస్ అధికారులు నిబంధనలు మీరుతున్న వాహనదారులపై కఠినచర్యలు చేపట్టి ట్రాఫిక్ సిబ్బందిని అవసరాన్ని బట్టి నియమించి పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యానాం వార్తలు


కో ఆపరేటివ్ ఆఫీసర్‌ను కలిసిన సిబ్బంది

సిఒను కలిసిన కో-ఆపరేటివ్ సిబ్బంది

ప్రజాశక్తి - యానాం

యానాం కోపరేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రామచంద్రయ్యను ఆ సంస్థ సిబ్బంది శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పుదుచ్చేరి సహకార శాఖలో డిఆర్‌సిఎస్ (లీగల్) అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.రామచంద్రయ్యను యానాం కోఆపరేటివ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పుదుచ్చేరి ఆర్‌సిఎస్ యశ్వంతయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన సిఒను సిబ్బంది కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు.

యానాంలో అన్నదానాలు

ప్రజాశక్తి - యానాం

యానాంలో వినాయక నవరాత్రి వేడుకల నేపథ్యంలో పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. పాత మార్కెట్ శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద, వెంకట్ నగర్ గణపతి పందిరిలో ఈ అన్నదానాలు నిర్వహించారు. తొలుత వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'దోచుకుంటున్న ఎంఎల్‌ఎ ద్వారంపూడి'

ప్రజాశక్తి-కాకినాడ


మట్టితో ఫిల్లింగ్ చేస్తున్న ప్రాంతాన్ని చూపిస్తున్న కొండబాబు

సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి బినామీగా రూ.వేల కోట్లు దోచుకుంటున్న అవినీతిపరుడు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆరోపించారు. శుక్రవారం ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రాంగణంలో కొండబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ భావితరాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆనాడు విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తే, కాసుల కక్కుర్తి కోసం ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఎంఎస్ఎన్ విద్యా సంస్థను డంపింగ్ యార్డ్‌గా తయారు చేశారన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు ఎంఎస్ఎన్ చారిటీస్‌కు కేటాయించడం జరగదని ద్వారంపూడి చెప్పారని, మరి కాకినాడ కార్పొరేషన్ సాధారణ నిధుల నుండి మడ అడవుల ఫిల్లింగ్ పేరుతో రూ.6 కోట్లు, ఆర్ అండ్ బి చేయాల్సిన ఎన్‌టిఆర్ బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు పనులు రూ.5.5 కోట్లు, సచివాలయాలు ఫర్నిచర్ పేరుతో రూ.7 కోట్లు ఎలా దోచుకున్నాడో ప్రజలకు తెలుసున్నారు. ద్వారంపూడి దోచుకోవడానికి మున్సిపల్ సాధారణ నిధులు పనికొస్తాయి తప్ప ఎంఎస్ఎన్ చార్టీస్ విద్యా సంస్థ అభివద్ధికి మున్సిపల్ సాధారణ నిధులు పనికిరావా అని ప్రశ్నించారు. శిథిలావ్యస్థకు చేరుకున్న చార్టీస్ వేద పాఠశాల, డిగ్రీ కళాశాలను నిర్మించి, ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ బిల్డింగులు మరమ్మతులు టిడిపి హయాంలోనే చేశామని గుర్తు చేశారు. అవినీతి సొమ్ముతో యజమానులను బెదిరించి దోచుకున్న ఐశ్వర్య గ్రాండ్ హోటల్ భూమిని ఇదే డంపింగ్ యార్డ్ మట్టితో ఫిల్లింగ్ చేయాలన్నారు. ప్రజల కష్టార్జితమైన ప్రజా సొమ్ములను దోచుకోవడంలో ద్వారంపూడికి మించిన వారు ఎవరూ రాష్ట్రంలోని లేరన్నారు. విద్యార్థుల ఆరోగ్యాలతో ద్వారంపూడి చెలగాటాలాడుతున్నాడని భరించలేని దుర్వాసనతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ద్వారంపూడి చేస్తున్న అవినీతిపై బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమేనని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, పలివెల రవి, వనపర్తి బద్రి, గదుల సాయిబాబా, పిర్ల లక్ష్మీప్రసన్న, బంగారు సత్యనారాయణ, తాడిచర్ల వెంకటేశ్వర్లు, గోరుసు దుర్గారావు, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు పాల్గొన్నారు.

ఉండేశ్వరపురంలో టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం


దీక్షలో పాల్గొన్న టిడిపిశ్రేణులు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకుడు వనపర్తి తాతాజీ ఆధ్వర్యంలో ఉండేశ్వరపురంలో సామూహిక రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీక్షకు జనసేన పార్టీ నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో భేరి శ్రీనివాస్, గ్రంధి సురేష్, తమ్మిశెట్టి వెంకటేష్, బట్టు దైవకప, పల్లి శశికళ, యలమాటి త్రిమూర్తులు, కాంద్రు శ్రీను, వాకలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎండాకు తెగులు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రామచంద్రపురం


ఎండాకు తెగులు సోకిన వరిచేను

తొలకరి వరిచేలపై ప్రస్తుతం ఎండాకు తెగులు ఆశించి రోజురోజుకు అధికమవుతోంది. దీనిపై రైతులు తీసుకోవలసిన చర్యలను మండల వ్యవసాయ అధికారి బలుసు రవి తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం కె.గంగవరంలో పొలంబడి ఏర్పాటుచేసి ఆకుఎండు తెగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఇది బాక్టీరియా వలన వస్తుందని దీనివలన ఆకులు ఎండు పోయినట్లుండి ఎర్రగా తయారవుతాయని ఆయన వివరించారు. దీనిని నివారించేందుకు నత్రజని ఎరువు లు వాడకం నిలిపివేయాలని, వరి చేల్లో ఇప్పటివరకు ఉన్న నిల్వ నీరు వెంటనే తొలగించాలన్నారు. దీనికి ప్లాంటా మైసిమ్, వలిడా మైసిన్, సుడామొనస్ పేరు గల మందులను బ్యాక్టీరియా కి పిచికారీ చేసి నివారణ పొందవచ్చున్నారు. పొటాష్ ఎరువులు మోతాదు ఎకరాలు 40 కేజీ లు వాడినచో తెగులు నిరోధక శక్తి లభిస్తుందన్నారు. దీనివలన నాణ్యమైన ఉత్పత్తి లభిస్తుందనీ ఆయన రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్ మంజు ప్రవల్లిక పావని పలువురు రైతులు పాల్గొన్నారు.

'సిఎంఎ'-23లో ర్యాంకర్‌కు అభినందన

ప్రజాశక్తి అమలాపురం


రమ్య శ్రీ ని అభినందిస్తున్న రమణారావు తదితరులు

అమలాపురానికి చెందిన అడ్డగర్ల రమ్యశ్రీ సిఎంఎ-23 పరీక్షల్లో జాతీయస్థాయిలో 18 వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా రమ్యశ్రీ ని అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు శుక్రవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో అభినందించారు. రమ్యశ్రీ కి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించి ఆర్థిక సాయం అందించారు. అనంతర మాట్లాడుతూ రమ్యశ్రీ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పి. రాజేష్, నేరేడుమిల్లి శ్రీను,కుంచే అర్జున్, పోలినాటి భీమేష్, దోనిపాటి రాంబాబు, బళ్ళ చిన్నరాజా, దేవరపల్లి జాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం పై వైసిపి కార్యకర్తలకు, నాయకులకు పట్టణంలోని కళ్యాణ మండపంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి విస్తతంగా ప్రసారం చేయాలని, నవంబర్ నుండి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేరాయో అడిగి తెలుసుకోవాలన్నారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీ టిడిపి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేసిందని ప్రశ్నించాలని ఆయన తెలిపారు. పార్టీ ఆదేశాల ప్రకారం పది ప్రశ్నలను సిద్ధం చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి వాటిని ప్రజలకు వివరించాలని తద్వారా వైసిపిపార్టీ బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. నియోజకవర్గం నుంచి నాయకులు కార్యకర్తలు ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్‌పిటిసి సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వసంం సుబ్బారావు, పెట్ల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ ఇళ్ళ సూర్యనారాయణ, ఎంపీపీ పంపన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి-మండపేట

రాబోయే ఖరీఫ్ పంటకు సంబంధించి ధాన్యం సేకరణకు మిల్లర్లు, అధికారులు సిద్ధంగా ఉండాలని జెసి శ్రీవాస్ నుపూర్ అజయ్ తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల కార్యాలయంలో రైసెమిల్లర్లు, జిల్లా పౌర సరఫరా, రవాణా శాఖ, రెవెన్యూ అధికారులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిల్లర్లు ముందుగా బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలని, రవాణా వాహనాలు అన్నిటికి జిపిఎ ఏర్పాటుచేయాలని, గన్నీబ్యాలు సిద్ధం చేయాలన్నారు. ఇందుకోసం జిపిఎ పరికరాలు ఏర్పాటుచేసే వ్యక్తితో ఎంఒయు కుదుర్చుకున్నట్లు తెలిపారు. తేమశాతం కొలిపే యంత్రాల్లో ఆర్‌బికెలకు మిల్లులకు తేడా వస్తున్నదున రైతులు, మిల్లర్ల మధ్య అయోమయం నెలకొంటోందన్నారు. అందువల్ల కొత్త యంత్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ 2020-2021 సంవత్సరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిల్లర్లకు రూ.300 కోట్లు రవాణా ఛారీలతో కలిపి బకాయి ప్రభుత్వం చెల్లించవలసి ఉందన్నారు. ప్రస్తుత అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2021-2022 సంవత్సరానికి రూ.54 కోట్లు వరకు బిల్లులు చెల్లించ వలసి ఉందన్నారు. ఏప్రాంతం రైతులు ఏమిల్లుకు రావాలో మిల్లర్లకు వెసులుబాటు కల్పించాలని మిల్లరు కర్రినారాయణ రెడ్డి కోరారు. రవాణా చేసేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులు కోరినందున తమ సొంత వాహనాలు ఏర్పాటు చేసినట్లు లారీ యూనియన్ నాయకులు తెలిపారు. అయితే ఆర్‌బికెల్లో రైతు సొంతంగా రవాణా చేసినట్లు నమోదు చేయడం వల్ల రవాణా ఛారీలు రైతుల అక్కౌంట్లలో జమ చేయడం వల్లతమకు అందడం ఆలస్యమయ్యిందన్నారు. మధ్యలో హాజరైన ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకు ండా వారిని దృష్టిలో పెట్టుకుని సిఎం జగన్ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జెసి మాట్లాడుతూ స్థానికంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విధాన పరమైన నిర్ణయాలపై ఉన్నతాధి కారులకు నివేదిక పంపనున్నట్లు తెలి పారు. సమావేశంలో జిల్లా పౌరసర ఫరా శాఖ డిఎం సుధాకర్, డిఎఒ పాపా రావు, వ్యవసాయ శాక జిల్లా అధికారి వి.బోసు బాబు, ఆలమూరు ఎడి కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడిద గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మండపేట

ఏడిద గ్రామ అభివృద్ధికి పాలకవర్గంతో కలిసి కృషి చేస్తున్నామని గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదురుగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షల అంచనాతో అభివృద్ధి చేస్తున్న సిసి రోడ్డు, డ్రైను నిర్మాణ పనులను పంచాయతీ మెంబర్లు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బూరిగ మాట్లాడుతూ ఏడిద గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ మెంబర్లు చిలుకూరి బుజ్జి, కొండేటి కాశీకృష్ణ, పైడిమళ్ల పెద్దబ్బులు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, మండల ఇంజనీర్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వీర్రాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లతో కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

రాహుల్ గాంధీని బిజెపి రావణాసురుడుగా చిత్రీకరించినందుకు నల్ల రిబ్బన్లు, నల్ల చొక్కాలు ధరించి కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీని రావణాసురుడుగా పోల్చి పోస్టర్ల ల్లో బిజెపి నేతలు వేయటంపై అమలాపురం గడియార స్తంభం సెంటర్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు, నల్ల చొక్కాలు ధరించి నిరసన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన చేపట్టారు. రాహుల్ గాంధీని రావణాసురుడు గా చిత్రీకరించటం బిజెపి చేసిన హేయ మైన చర్యగా వారు అభివర్ణించారు. కార్యక్రమంలో మహమ్మద్ ఆరిఫ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంటెద్దు బాబి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, పిసిసి సభ్యురాలు అయితాబత్తుల సుభాషిణి, ఏఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పిసిసి డెలిగేట్స్ మాచవరపు శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.